## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఎంటీఎంసీ పరిధిలోని ఎర్రబాలెం తదితర ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎర్రబాలెం సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

### పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. 187 మందికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పరిసరాల శుభ్రత గురించి వివరించారు. వైద్యురాలు అశ్రున్ మాట్లాడుతూ ఇంటి చుట్టు పక్కల ఉన్న పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. శీతాకాలంలో జలుబు, దగ్గు, జ్వరం వచ్చే ప్రమాదముందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేడిగా ఆహారం, నీరు తీసుకోవాలని సూచించారు. హెచ్‌వీ అన్నమేరి, బాబురావు, ఎంఎల్ హెచ్‌పీ, ఏఎన్‌ఎం అరుణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టార్గెట్‌గా ఇళ్లు కూలదోస్తున్నారు

- ఆత్మీయ సమావేశంలో లాం గ్రామస్తులు
- ధైర్యం చెప్పిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బాల వజ్రబాబు



ఆత్మీయ కలయికలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

లాం(తాడికొండ): కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులే టార్గెట్‌గా గ్రామాల్లో ఇళ్లు కూలదోస్తున్నారని లాం గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం లాం గ్రామంలో వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అధ్యక్షతన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పలువురు సమస్యలను ఏకరువు పెట్టారు. గ్రామంలో కొండ పోరంబోకులో సుమారు 400 గృహాలను పేదలు నిర్మించుకొని నివాసం ఉంటుంటే వైఎస్సార్ సీపీకి చెందిన 40 మంది గృహాలను టార్గెట్ చేసి కూలదోశారని చెప్పారు. 300 మంది క్వారీ కార్మికులు ఉన్న క్వారీ సొసైటీని సైతం గుప్పెట్లోకి తీసుకొని అక్రమంగా మైనింగ్ చేసి అందరి పొట్టగొడుతున్నారని వాపోయారు. ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు సానుకూలంగా విన్న బాల వజ్రబాబు దీనిపై మరింత విస్తృతంగా చర్చించి అక్రమాలపై త్వరలో న్యాయబద్ధ పోరాటానికి దిగుదామని హామీ ఇచ్చారు. గతంలో జరిగిన తప్పులు, విభేదాలు పక్కన బెట్టి భవిష్యత్తులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలన్నారు. బండారుపల్లి సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి రాజు, షేక్ సాదిక్, రాయపూడి రంగారావు, రావూరి నరేష్, షేక్ సలీమ్, షేక్ మీర్జావలి, కుక్కమళ్ల రవి దామరపల్లి నాయకులు నల్లిబోయిన శ్రీనివాసరావు, కాజా సాంబిరెడ్డి, తాడికొండ హనుమంతరావు, కన్నెబోయిన జగదీష్, బొల్లెద్దుల శివాజీ, జంగా యలమంద పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణ వాగ్దానం నిలబెట్టుకోవాలి

తాడేపల్లిరూరల్: కూటమి పార్టీలు ఎన్నికల హామీలో భాగంగా పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. శుక్రవారం మంగళగిరి తహసీల్దార్‌కు వినపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుపేదలకు ఇస్తానన్న ఇళ్ల స్థలాల హామీని మరుగున పడేసిందన్నారు. పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

తాడికొండ: సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా తాడికొండ తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు నిర్మల కృష్ణకు వినతిపత్రం అందజేశారు. తాడికొండ సీపీఐ కార్యదర్శి ముప్పాళ్ల శివ శంకరరావు, రేపూడి శ్రీనివాసరావు, కుర్రా అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పోరాటం ఉధృతం చేస్తాం

తాడేపల్లిరూరల్ : గత 32 ఏళ్లుగా నష్టపరిహారం కోసం న్యాయ పోరాటం చేస్తున్న కార్మికుల పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏసీసీ కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు. స్టీవెన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా కార్మికుల సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. కార్మికులు రమాదేవి, శారమ్మ, ఎస్కే ఇమాంబీ, ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, సూర్యప్రకాష్, దేవరాజు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి పూజలు

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ అర్చనలు చేశారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివార్లను హనుమ వాహనంపై ఉంచి అర్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 113 తాళ్లూరులోని వేణుగోపాల స్వామికి విశేష అర్చనలు చేశారు. పొనుగుపాడు ఆంజనేయ స్వామికి, యర్రగుంట్లపాడులోని వేణుగోపాలస్వామికి అర్చకులు సత్యనారాయణాచార్యులు విశేష పూజలు చేశారు.

మేడికొండూరు: డోకిపర్రు వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణం గావించారు. ఏకాదశి పూజలు చేశారు.

**అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి**



వేణుగోపాలస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: కొలనుకొండ వద్ద ఉన్న హరేకృష్ణ గోకుల క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్వామివారిని ఉత్తర ద్వార దర్శనంలో ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాధాకృష్ణుని, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీరంగనాథుకి పూజా కార్యక్రమాలు నిర్వహించి, 30 వేల మందికి అన్నదానం చేశారు.

### క్యాటిల్ షెడ్ ప్రారంభం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ, ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన క్యాటిల్ షెడ్‌లను శుక్రవారం ఎంపీపీ షేక్ జాబీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని పెనుమూలి, చిలువూరి గ్రామాల్లో పశుపోషకులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం సబ్సిడీపై షెడ్లు నిర్మించిందని తెలిపారు. ఉపాధ్యక్షురాలు పసుపులేటి సాయి చైతన్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అశోక్, జనసేన అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు ఉన్నారు.

## ఎండీయూ వాహనం ఆపరేటర్, అసిస్టెంట్ రచ్చ



తాడేపల్లి రూరల్: ఉండవల్లిలో శుక్రవారం ఎండీయూ వాహనం ఆపరేటర్, అసిస్టెంట్ మధ్య రచ్చ జరిగింది. దీంతో ఎండీయు వాహనం టైర్లు విడదీసి అసిస్టెంట్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సేకరించిన వివరాల ప్రకారం ఉండవల్లి హరిజనవాడలోని 4వ డిపోకు చెందిన ఎండీయూ ఆపరేటర్ జయప్రకాష్ కొంతకాలంగా రేషన్ బియ్యం అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాడు. తన అసిస్టెంట్ బత్తుల రమేష్‌కు ఆ బాధ్యతలు అప్పగించాడు. రమేష్ బియ్యం పంపిణీ చేయాలంటే జయప్రకాష్ వేలిముద్ర తప్పనిసరి. రమేష్ వాహన రిపేర్లతో పాటు కొత్త టైర్లు అమర్చాడు. అయితే ఆపరేటర్ జయప్రకాష్ వేలిముద్ర వేయకపోవడంతో వాహనానికి తానెందుకు డబ్బులు ఖర్చు పెట్టాలని బియ్యం ఉండగానే వాహనానికి అమర్చిన టైర్లను రమేష్ తీసుకుని వెళ్లిపోయాడు. ఈ పంచాయతీ తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి చేరింది. వీఆర్‌ఏ ఆ వాహనాన్ని అలాగే ఉంచి రేషన్ అందజేశారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో రమేష్‌తో మాట్లాడి వాహన టైర్లను బిగించారు. ప్రస్తుతం అంగన్‌వాడీకి చెందిన రేషన్ మాత్రమే అందజేశారు. వీఆర్‌ఏ వేలిముద్ర అథంటికేషన్‌పై రేషన్ అందజేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## సంక్షిప్త వార్తలు

**సీఆర్డీఏ గ్రీవెన్స్ 53 అర్జీలు**

తాడికొండ: గ్రీవెన్స్ డేలో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని సీఆర్డీఏ అదనపు కమీసనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ తెలిపారు. శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు రైతులు, రైతు కూలీలు ఫిర్యాదులను అందజేశారు. 53 అర్జీలు రాగా కొన్ని సమస్యలను కొన్ని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి సంబంధిత విభాగాల అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కేఎస్ భాగ్యరేఖ, కె.స్వర్ణమేరి, పి.పద్మావతి, జి.రవీందర్, ఏజీ చిన్నికృష్ణ, బి.సాయి శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన నగదు చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణం 20వ వార్డుకు చెందిన అద్దంకి మురళీకి రూ.1,80,634, 15వ వార్డుకు చెందిన తమ్మా రేవంత్‌రెడ్డికి రూ.32,600, 13వ వార్డుకు చెందిన గోలి కుసుమకు రూ.35,000లు వారి నివాసాలకు వెళ్లి అందజేశామని తెలిపారు.

**12 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు**

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : మంగళగిరిలో ఈ నెల 12 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మంగళగిరి కార్యాలయం నుంచి శుక్రవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 23న మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా మంత్రి సొంత ఖర్చులతో ఈ 23వ తేదీ వరకు ఈ పోటీలను ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో నవులూరు క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్నారు.

**ఉత్సాహంగా తాడేపల్లి సూపర్ లీగ్**

తాడేపల్లి రూరల్ : ఉండవల్లి దేవుని మాన్యం గ్రౌండ్‌లో తాడేపల్లి సూపర్ లీగ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం 4వ రోజుకు చేరుకున్నాయి. నిర్వాహకులు జొన్న రాజేష్, గాదె వినయ్, కొల్లి శేషు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న జట్లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కింద నటుడు రామ్‌చరణ్ గేమ్ ఛేంజర్ మూవీ టిక్కెట్లు అందజేశామని తెలిపారు. జనసేన పార్టీ తాడేపల్లి రాష్ట్ర ఐటీ కో-ఆర్డినేటర్ చవ్వాకుల కోటేష్‌బాబు, టీడీపీ నాయకులు మన్నెం కిషోర్, తోట సాంబశివరావు, 19వ వార్డు అధ్యక్షుడు కాశీమాల దినేస్ చక్రవర్తి, జాతీయ కాపు సంఘం ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి రాము, టోర్నమెంట్ ఆర్గనైజర్ గాజుల సురేష్ పాల్గొన్నారు.

**12న గౌడ సంఘం ముగ్గుల పోటీలు**

తాడేపల్లి రూరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తాడేపల్లి మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు పలగాని శ్రీనివాసరావు, అధ్యక్షుడు తులసిదాస్, సలహాదారు కాశయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం స్థానిక గౌడ కల్యాణ మండపంలో ఈ పోటీలు నిర్వహించనున్నామని వివరాలకు 90598 43456, 99660 13899 నంబర్లకు సంప్రదించాలన్నారు.

**స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి**


ఫిరంగిపురం: వెలుగు స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రంలో వెలుగు స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు లింకేజీ డీపీఎం కేశవరావు, ఏపీడీ నారాయణరావు, జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ జి.చంద్రం, సర్పంచ్ మేడాబాబు, కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, మండల సమాఖ్య ప్రెసిడెంట్ కె.చిరంజీవి, ఏపీఎం నాగేశ్వరరావు, మార్టు ప్రెసిడెంట్ సృజన, ట్రెజరర్ బి.జ్యోతి, సెక్రటరీ చిన్నమ్మ, సీసీలు కరిముల్లా, ఆదిలక్ష్మి, ద్వారక, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




# ఆధ్యాత్మికతకు మారుపేరు మంగళగిరి

## చదువుల తల్లి మంగళగిరి

- విజయవాడ, గుంటూరు మధ్య ప్రధాన నగరంగా అభివృద్ధి
- ప్రఖ్యాత యూనివర్సిటీలు, ఫార్మసీలతో విద్యాభివృద్ధి




మంగళగిరి నరసింహస్వామి దేవస్థానం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరిని క్రీస్తు పూర్వం 225 నుంచి క్రీస్తు శకం 225 వరకు ఆంధ్ర శాతవాహనుల పరిపాలనలో ఉంది. క్రీస్తు శకం 225 నుంచి 300వరకు ఇక్ష్వాకులు, పల్లవులు, ఆనంద గోత్రిజులు అనంతరం విష్ణుకుండినుల ఏలుబడిలోకి వచ్చింది. ఆనంద గోత్రిజుల నాలుగు తరాల రాజులు సుమారు వందేళ్ల పాటు మంగళగిరి సమీపంలోని 'కంతేరు'ను ముఖ్య పట్టణంగా చేసుకుని పరిపాలించారు. విజయనగర సామ్రాజ్యంలోని 200 పట్టణాల్లో మంగళగిరి ఒకటి. అనంతరం ఆంగ్లేయులు రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడిని ఈ ప్రాంత జమిందారుగా నియమించారు. మంగళగిరి నియోజకవర్గం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ఆధ్యాత్మికం. మంగళగిరిలో కొండ దిగువన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, కొండ ఎగువన పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం. ఆపై గండాలయ స్వామి ఆలయం వద్ద నిత్యం అఖండ జ్యోతి వెలుగుతూనే ఉంటుంది. మంగళగిరి చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి. తాడేపల్లి రూరల్ ఉండవల్లిలో అతి పురాతన గుహలతో కూడిన అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో 21 అడుగల రాతి విగ్రహం, ప్రకాశం బ్యారేజీకు ఆనుకుని ఉన్న విజయకీలాద్రిపై వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఉన్నాయి. కొండ దిగువ శ్రీరామ చంద్రస్వామి, ఆంజనేయస్వామి దేవస్తనాలు, దుగ్గిరాల మండలంలో మహంకాళీ అమ్మవారు, ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణమ్మ పరవళ్ల చుట్టుపక్కల అందాలు గుర్తుకు వస్తాయి.



మంగళగిరిలో నిర్మల ఫార్మసీ కళాశాల

మంగళగిరి నియోజకవర్గం రెండు మహానగరాల మధ్య ఉండడంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అభివృద్ధిలో భాగంగా ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుంటుండగా పెద్ద పెద్ద యూనివర్శిటీలు, పలు కళాశాలలు, ఏర్పడడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. మంగళగిరిలో చేనేత వస్త్రాలకు ఎంతో ప్రసిద్ధికావడంతో దేశ విదేశాల నుండి ఎంతోమంది మంగళగిరి వచ్చి చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తారు. మంగళగిరి రెండు కొండల మధ్య ఎయిమ్స్ హాస్పిటల్ నిర్మించడంతో పాటు పలు కార్పొరేట్ హాస్పిటళ్లు ఈ ప్రాంతంలోకి రావడంతో వైద్యపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. గత పది సంవత్సరాలుగా అభివృద్ధి చెందడంతో కొత్త కొత్త కళాశాలలు, యూనివర్శిటీలు రావడంతో విద్యాపరంగా అభివృద్ధి చెందుతోంది. మంగళగిరి రూరల ఆత్మకూరులో నిర్మల ఫార్మసీ కళాశాల ఎంతో అభివృద్ధి చెందడంతో పలు రాష్ట్రాల నుండి వచ్చి విద్యను అభ్యసించి వారి రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నారు. దీంతో పాటు పలు డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు, ఉన్నాయి. మంగళగిరి నియోజకవర్గంలో రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పండే పంటలన్నీ పండిస్తూ ఎప్పుడు పంట పొలాలు పచ్చగా ఉంటాయి.



ఉండవల్లి గుహలు
















### ముందస్తు సంక్రాంతి



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మేడికొండూరు : మండలంలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ కోట శ్రీనివాస్ అధ్యక్షత పాల్గొన్నారు.

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి సంస్థల కోశాదికారి వై.అనంతకుమారి బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల డీన్స్ ఫణికుమార్, వివి సుబ్బారావు, బాలమురళీ కృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని గుడ్ న్యూస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. రెవ ఫాదర్ ఆరోఖ్యదాస్, అడ్మినిస్ట్రేటర్ రెవ. ఫాదర్ సుగంధర్, క్యాంపస్ ఇన్‌చార్జి రెవ ఫాదర్ సెబాస్టియన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రంగవల్లులు తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు



ముగ్గులు పరిశీలిస్తున్న అధ్యాపకులు







